నేడు రవీదేవి ప్రమాణ స్వీకారం

కొత్తపేట: మండలంలోని అవిడి సర్పంచ్ రెడ్డి చంటి సతీమణి రవీదేవి నేడు ఏఎంసీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కొత్తపేట ఏఎంసీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి శెట్టిబలిజ వర్గానికి చెందిన రెడ్డి రవీదేవికి చైర్మన్ పదవి కట్టబెట్టారు. ఆది నుంచీ క్షత్రియ, కాపు కులాలకే ఈ పదవి కట్టబెట్టగా జగ్గిరెడ్డి 2020లో ఎస్సీ వర్గానికి చెందిన గొల్లపల్లి డేవిడ్‌రాజుకు, నేడు బీసీ వర్గానికి చెందిన రవీదేవికి కేటాయించి సామాజిక సమ న్యాయం చేశారు. మంగళవారం జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో జరిగే నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు.


కొత్తపేటలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న రవీదేవి-చంటి దంపతులు

12 నుంచి క్రీడా పోటీలు

అయినవిల్లి: పాఠశాల విద్యాశాఖ అకడమిక్ క్యాలెండర్ ప్రకారం పాఠశాల క్రీడా సమాఖ్య క్రీడా పోటీలు మండల స్థాయిలో 12 నుంచి 14వ తేదీ వరకు జరుగుతాయని ఎంఈవో జేవీఎల్ కనకదుర్గ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు అండర్-14, 17 విభాగాల్లో బాలురు, బాలికలకు మండలస్థాయిలో చాంపియన్ షిప్ సెలక్షన్స్ జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో మండల స్థాయిలో ఎంపికైన జట్లు నియోజక వర్గ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను అకడమిక్ మానిటరింగ్ యాప్‌లో తప్పనిసరిగా రిజిస్టర్ చేయాలని ఎంఈవో కనకదుర్గ ఆదేశించారు.

దేవాదాయ ధర్మాదాయ శాఖ
శ్రీ సూకాంబికా అమ్మవారి దేవస్థానం, చింతలూరు (గ్రా.) ఆలమూరు (మ)
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా
ఆర్.సి.నెం.12/2023. తేది.01-09-2023
సీల్డు టెండర్ కమ్ బహిరంగవేలం ప్రకటన
షెడ్యూల్

క్ర. సం.	పాట వివరము	ప్రథమ ధరావత్తు	కాలపరిమితి	సెక్యూరిటీ	వేలంపాట జరుగు ప్రదేశం తేది
1	శ్రీ సూకాంబికా అమ్మవారి ఆలయము వద్ద [illegible]	రూ.10,000/-	ది.01-10-2023 నుండి ది.30-09-2024 వరకు 1 సంవత్సరం	రూ.10000/-	శ్రీ సూకాంబికా అమ్మవారి ఆలయం వద్ద తేది.20-09-2023 బుధవారం ఉదయం 10.00 గంటలకు

పాట షరతులు: 1. [illegible] ... ఫోన్ నంబరు : 98660 77080, 98490 14184
కార్యనిర్వహణాధికారి

రహదారిని అభివృద్ధి చేయాలి

అయినవిల్లి: ముక్తేశ్వరం -కె.జగన్నాథపురం రహదారిని అభివృద్ధి చేయాలని తొత్తరమూడి, కె.జగన్నాథపురం, శంకరాయగూడెం గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ రహదారి గుంతలు పడి ప్రమాదాలకు నిలయంగా మారిందన్నారు. రహదారిని అభివృద్ధి చేయాలని వీరు కోరారు.







ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి
- వెలిచేరులో గడప గడపకూ..

ఆత్రేయపురం: మండలంలోని వెలిచేరులో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు పెద్దింటి వేణుగోపాల్, కునాథరాజు శ్రీనివాసరాజు, సర్పంచ్ వేముల శ్రీనివాస్, ఎంపీటీసీ వెంకన్నబాబు, వేముల రామన్న తదితరుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వం నాలుగేళ్లలో అందించిన సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ వెళ్లి వివరించారు. లబ్ధిదారుల గణాంకాలతో సహా వివరించి మళ్లీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు పొందని వారితో మాట్లాడుతూ అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందిస్తున్న భోజనాన్ని రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, తహసీల్దార్ డీవీఎస్ అనిల్‌కుమార్, వివిధ శాఖల అధికారుల, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు.


వెలిచేరులో మహిళకు పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి తదితరులు

ఘనంగా ఎమ్మెల్యే రాపాక పుట్టినరోజు

మలికిపురం: మండలంలోని చింతలమోరి గ్రామం బీచ్‌నగర్‌లో రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు జన్మదిన వేడుకలను వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు తనయుడు రాపాక వెంకట్ రామ్, కేఎస్ఎన్ రాజు, ఎంపీటీసీ సభ్యులు తోటి రాజేష్ కేక్ కట్ చేసి పంచారు. రాజోలు శాసనసభ్యులకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చెవ్వాకుల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, రాపాక అభిమానులు పాల్గొన్నారు. మలికిపురం కూడలిలో కూడా పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి పంచారు. వైస్ ఎంపీపీ రుద్రరాజు చినరాజా, గెడ్డం తులసీ భాస్కరరావు, కోళ్ళ వేణుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: మండలంలో వివిధ గ్రామాల్లో రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పుట్టినరోజు వేడుకలు అభిమానులు, కుటుంబ సభ్యులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. రాజోలు వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ఆధ్వర్యంలో శృంగవరప్పాడులో మణికుమారి వృద్ధుల ఆశ్రమంలో వృద్ధుల మధ్య ఎమ్మెల్యే పుట్టినరోజు కేక్‌ను ఆయన కుమారుడు రాపాక వెంకట్‌రామ్ కట్ చేశారు. అనంతరం వృద్ధులకు భోజన వసతి కల్పించారు. ఆశ్రమ నిర్వాహకులు, తాడి సహదేవ్ తదితరులు పాల్గొన్నారు. అంతర్వేదిపాలెం పంచాయతీ వద్ద ఎమ్మెల్యే పుట్టినరోజు కేక్‌ను ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ నల్లి లీలావతి కట్ చేశారు. నాయకులు నల్లి సురేంద్రరావు, ఈద రవిరెడ్డి, నల్లి త్రిమూర్తులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

రాజోలులో..

రాజోలు: రైతులు, రైతు కూలీల సమక్షంలో రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పుట్టిన రోజు వేడుకలను సోమవారం చెన్నడం గ్రామంలో వినూత్నంగా నిర్వహించారు. సర్పంచ్ బడుగు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పుట్టినరోజు కేక్‌ను వరి పొలాల మధ్య రైతుల సమక్షంలో కట్ చేశారు. అలాగే రాజోలు, తాటిపాక సెంటర్లలలో ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాజోలు మార్కెట్ సెంటర్‌లో స్థానిక యువకులు నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే రాపాక తనయుడు రాపాక వెంకట్ పాల్గొని కేక్ కట్ చేశారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, జెడ్పీటీసీ మట్టా శైలజ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే రాపాక పుట్టిన రోజు కేక్ కట్ చేస్తున్న కేఎస్ఎన్ రాజు, రాపాక వెంకట్రామ్


అంతర్వేదిపాలెం పంచాయతీ వద్ద పుట్టినరోజు కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ, సర్పంచ్ లీలావతి

అధికారులు సమన్వయంతో పని చేయాలి

రావులపాలెం: గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనుల్లో అధికారులు స్థానిక నాయకులతో సమన్వయంగా ముందుకుసాగుతూ పని చేయాలని ఎంపీపీ కర్రి లక్ష్మీవెంకట నాగదేవి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. తొలుత సమావేశంలో వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల ప్రగతి నివేదికను సభకు వివరించారు. ఎంపీపీ నాగదేవి మాట్లాడతూ అధికారులు గ్రామ స్థాయిలో జరిగే ప్రతి అభివృద్ధి కార్యక్రమంలోను స్థానిక ఎంపీటీసీ సభ్యులకు తప్పనిసరిగా తెలపాలన్నారు. పలువురు ఎంపీటీసీలు లేవనెత్తిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ అధికారులను ఆదేశించారు. అలాగే కేతరాజుపల్లిలో డ్వాక్రా సంఘాలకు లోన్లు సకాలంలో వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఏపీఎం సువార్తను ఎంపీపీ ఆదేశించారు. అనంతరం ఇటీవల సేవా విభాగంలో అబ్దుల్ కలాం ఇన్‌స్పిరేషన్ అవార్డు స్వీకరించిన రావులపాడు ఎంపీటీసీ గెడ్డం ఆశా-కిషోర్ దంపతులను, ఆగస్టు 15 కు ఇచ్చే సేవా అవార్డుల్లో జిల్లా ఉత్తమ అవార్డు తీసుకున్న మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.రాజేంద్రప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ కె.సతీష్ మోహన్‌లను ఎంపీపీ చేతుల మీదుగా సన్మానించారు. సమావేశంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, డీసీఎంఎస్ చైర్మన్ సాకా మణికుమారి, వైస్ ఎంపీపీ గన్నవరపు వెంకటరావు, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఇన్‌చార్జి తహసీల్దార్ వి.శ్రీరామచంద్రమూర్తి, ఎంపీటీసీలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


మండల పరిషత్ సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కేఎల్వీ నాగదేవి

నార్కెడ్‌మిల్లి ఉప సర్పంచ్‌గా పోతిరెడ్డి సురేష్

ఆత్రేయపురం: మండలంలోని నార్కెడ్‌మిల్లి పంచాయతీ ఉప సర్పంచ్‌గా పోతిరెడ్డి సురేష్‌ను వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు రావులపాలెం ఈఓపీఆర్‌డీ, ఎన్నికల అధికారి జి.కృష్ణ తెలిపారు. సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికలో పోతిరెడ్డి సురేష్‌ను వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో ఎన్నికల అధికారి జి.కృష్ణ ఎన్నికల ధ్రువపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పాల నాగేశ్వరరావు, ఎంపీటీసీ పాల వెంకటరమణ, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణం

మామిడికుదురు: బి.దొడ్డవరం నుంచి అప్పనపల్లి వరకు రూ.84 లక్షలతో సుమారు రెండు కిలోమీటర్ల మేర సిమెంట్ కాంక్రీట్ రోడ్డు నిర్మిస్తున్నారు. ఎంతో కాలం నుంచి అధ్వానంగా ఉన్న పంచాయతీ రాజ్ శాఖకు చెందిన ఈ రోడ్డు ఎట్టకేలకు అభివృద్ధికి నోచుకుంటోంది. దశాబ్దంన్నర క్రితం ఈ రోడ్డును అభివృద్ధి చేశారు. అప్పటి నుంచి దీని ఆలనా, పాలనా పట్టించుకున్న దాఖలాలు లేవు. చాలా కాలం నుంచి అధ్వానంగా ఉన్న ఈ రోడ్డు ఆధునీకరణకు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు నిధులు మంజూరు చేయించారు. రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా బి.దొడ్డవరం షిర్డీ సాయిబాబా ఆలయం నుంచి అప్పనపల్లి గ్రామ దేవత కనక మహలక్ష్మి అమ్మవారి ఆలయం వరకు ఉన్న బీటీ రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నారు. పంచాయతీరాజ్ డీఈఈ అన్యం రాంబాబు నేతృత్వంలో ఏఈ చిన్నంరాజు స్వీయ పర్యవేక్షణలో ఈ రోడ్డు అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నారు. సర్పంచ్ చెల్లుబోయిన రామశివసుబ్రహ్మణ్యం ఈ రోడ్డు అభివృద్ధి పనుల్ని సోమవారం పరిశీలించారు.

నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలి

అంబాజీపేట: ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యత ప్రమాణాలతో డ్రైనేజీని నిర్మించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు అన్నారు. మాచవరం మెట్లకాలనీలో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను సోమవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆదేశాల మేరకు డ్రైనేజీని రూ.5 లక్షలతో నిర్మిస్తున్నామన్నారు. కాలనీలో అపరిష్కృతంగా ఉన్న డ్రైనేజీ సమస్యను ఎమ్మెల్యే చిట్టిబాబు దృష్టికి తీసుకువెళ్లడంతో ఇటీవల డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారన్నారు. ఈ డ్రైనేజీని వినాయకుడి గుడి వద్ద నుంచి మోకా వారిపేట వరకు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, అప్పన శ్రీను, యలమంచిలి బుచ్చిబాబు, యాగన కోటయ్య, కోమలి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు చేయించుకోవాలి

అంబాజీపేట: రైతులకు ఈ-పంట నమోదుతో ఎంతో మేలు జరుగుతుందని ఏవో సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అన్నారు. అంబాజీపేట మండలంలో జరుగుతున్న ఈ-పంట నమోదును సోమవారం ఆయన పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అందించే ప్రతి పథకం ఈ పంట నమోదుపైనే ఆధారపడి ఉందన్నారు. ప్రతి రైతు తమ పంటలను తప్పనిసరిగా రైతు భరోసా కేంద్రానికి వెళ్లి వ్యవసాయశాఖ సహాయకులను కలసి సాగు చేసిన పంట రకం, విస్తీర్ణం, సర్వే నంబర్, ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకంతో వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు.

స్కూల్ గేమ్స్ విజయవంతంగా నిర్వహించాలి

అంబాజీపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే మండల స్థాయి క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించాలని ఎంఈఓ కె.వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట మండల రీసోర్స్ భవనంలో పీడీ, పీఈటీలకు స్కూల్ గేమ్స్‌పై సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 12, 13, 14 తేదీల్లో అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించనున్నామన్నారు. అండర్-14, అండర్-17 విద్యార్థులకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, త్రోబాల్, షటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులంతా పాల్గొనవచ్చన్నారు. సమావేశంలో హెచ్ఎం కె.సాయిరామ్, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత

అయినవిల్లి: పూరిల్లు కాలి బూడిదైన ఘటనలో కట్టుబట్టలతో మిగిలిన మూడు కుటుంబాల బాధితులకు గన్నవరపు సూర్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వంట సామగ్రి, గిన్నెలు, రైస్ ప్యాకెట్లు, దుస్తులు, నిత్యావసరాలను ట్రస్టు నిర్వాహకుడు, అయినవిల్లి జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు సోమవారం అందజేశారు. అయినవిల్లి మండలం వెలువలపల్లిలో ఆదివారం రాత్రి గ్యాస్ సిలిండర్ పేలడంతో అగ్నిప్రమాదానికి గురై సర్వం కోల్పోయిన బూల లక్ష్మి, బూల గంగాజలం, చెల్లి అంజలి అనే మూడు కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. అగ్నిప్రమాదానికి గురైన ఇల్లును పరిశీలించి ప్రభుత్వం నుంచి వచ్చే సహాయం కూడా అందేలా అధికారులతో మాట్లాడి స్థానిక సర్పంచ్ బొంతు మణి, ఎంపీటీసీ చల్లాబత్తుల సాయిలక్ష్మి ఆధ్వర్యంలో సహాయం చర్యలు తీసుకుంటామని జెడ్పీటీసీ తెలిపారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జ్వరం వస్తే అశ్రద్ధ వద్దు

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణ మార్పుల కారణంగా విష జ్వరాలు అధికంగా ఉన్నాయని వాటి పట్ల అశ్రద్ధ చేయకుండా సరైన వైద్యం చేయించుకోవాలని అంబాజీపేట పీహెచ్‌సీ వైద్యాధికారి కేవీ శ్రీనివాస్ అన్నారు. గంగలకుర్రులో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సుమారు 70 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో లేవలేని పరిస్థితుల్లో ఉన్న రోగులు ఇంటికి వెళ్లి వారిని పరీక్షించి తగు సలహాలు సూచనలు చేశారు. జ్వరాల బారిన రోగులను గుర్తించి వారికి వైద్య సేవలు అందించాలని ఏఎన్ఎం, ఆశాలకు సూచించారు.

మెరకపాలెం ఉప సర్పంచ్‌గా నాగార్జున

రాజోలు: మెరకపాలెం ఉప సర్పంచ్‌గా యలుమర్తి నాగార్జున బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2021 ఏడాదిలో జరిగిన ఎన్నికల్లో సర్పంచ్‌గా గెలుపొందిన గిడుగు సూర్యనారాయణ అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఉప సర్పంచ్‌గా ఉన్న ఆయన కుమారుడు గిడుగు బుజ్జిబాబు సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. దీంతో ఉప సర్పంచ్ పదవికి ఖాళీ ఏర్పడింది. ఉప సర్పంచ్ పదవికి ఎన్నిక నిర్వహించగా నాగార్జున ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సర్పంచ్ గిడుగు బుజ్జిబాబు, అడబాల సత్య రమేష్, గిడుగు శేఖర్, అడబాల రామకృష్ణరావు, పంచాయతీ కార్యదర్శి యెరుబండి శ్రీనివాస్ అభినందించారు.

ఎమ్మెల్యే చిట్టిబాబుకు పరామర్శ

అంబాజీపేట: హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబును పలువురు నాయకులు సోమవారం పరామర్శించారు. చిట్టిబాబును రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు, సొసైటీ అధ్యక్షులు మట్టపర్తి చంద్రశేఖర్, కటకంశెట్టి ఆదిత్యకుమార్, మట్టపర్తి యజ్ఞశ్రీ వెంకటేశ్వరరావులు పరామర్శించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

వలంటీర్ల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు

మామిడికుదురు: వలంటీర్ల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎంపీపీ కుసుమ వనజకుమారి పేర్కొన్నారు. మండలంలో ఖాళీగా ఉన్న 10 మంది వలంటీర్ పోస్టులను భర్తీ చేశారు. కొత్తగా అర్హత సాధించిన వారికి ఎంపీపీ సోమవారం నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వనజకుమారి మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం పాలనలో వినూత్నమైన మార్పులకు నాంది పలికిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందజేయడంతో వలంటీర్ల పాత్ర చాలా కీలకమైందని ఆమె పేర్కొన్నారు. ప్రతిపక్షాలు కేవలం రాజకీయ లబ్ధి కోసం వలంటీర్లపై ఆరోపణలు చేస్తున్నాయని ఎంపీపీ ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాలు ప్రజల్లో నూతన చైతన్యం తీసుకు వచ్చాయన్నారు. కార్యక్రమంలో అప్పనపల్లి దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యుడు కొమ్ముల సూరిబాబు, పార్టీ నేతలు కుసుమ శ్రీధర్, గోగి రామ్మూర్తి, కుసుమ హర్ష పాల్గొన్నారు.

విద్యార్థులు అభ్యసనా సామర్థ్యాలు పెంచుకోవాలి

రావులపాలెం: విద్యార్థులు అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపరచుకోవడానికి, అదనపు విజ్ఞానాన్ని పొందడానికి ట్యాబ్స్ వినియోగాన్ని పెంచాలని సమగ్ర శిక్ష ఏఎంఓ పి.రాంబాబు సూచించారు. మండలంలోని గోపాలపురం, పొడగట్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పాఠశాలకు ట్యాబ్స్ తీసుకొచ్చే విధంగా ఉపాధ్యాయుల పర్యవేక్షణ ఉండాలన్నారు. తొలుత ఎంఈఓ-2 బి.శ్రీనివాసరాజుతో కలసి ఆయన పీఎంశ్రీ కి ఎంపికైన గోపాలపురం బాలుర ఉన్నత పాఠశాల, పొడగట్లపల్లి ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పీఎంశ్రీ ప్రమాణాలకు అనుగుణంగా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు ఉన్నాయా లేదా అనే అంశాన్ని ఆయన పరిశీలించారు. అలాగే ఆలమూరు మండలంలోనూ పలు స్కూళ్లను సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

పాఠశాలల అకడమిక్ క్యాలెండర్ ఆవిష్కరణ

సఖినేటిపల్లి: స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో సోమవారం మండల స్థాయి 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలల అకడమిక్ క్యాలెండర్‌ను ఎంఈవో-1 డి.కిషోర్‌కుమార్ ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నెలల వారీగా ఏయే నెలల్లో విద్యార్థులకు ఏయే పాఠాలు చెప్పాలో, వర్క్ బుక్స్‌లో ఏయే నెలల్లో ఏయే కృత్యం విద్యార్థులతో ఉపాధ్యాయులు చేయించాలో ఇందులో పొందుపరిచినట్లు కిషోర్‌కుమార్ తెలిపారు. వీటితో పాటు ఏయే నెలల్లో ఫార్మేటివ్ పరీక్షలు, సమ్మెటివ్ పరీక్షలు నిర్వహించాలో కూడా క్యాలెండర్ తెలియపరుస్తుందన్నారు. ఈ అకడమిక్ క్యాలెండర్ ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఎంతగానో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఎంఈవో-2 ఎం.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



